# గుంటూరు

గొప్ప ముప్పు తెచ్చిపెట్టింది అతని గుంటూరు చదువు.

అతని పేరు అప్పల నరసింహం.

అతను విజయనగరంలో పుట్టేడు. విశాఖపట్నంలో పెరిగేడు.

అతనికి గుంటూరంటే ఇష్టంలేదు.

అతను నల్లిని చంపడు, పిల్లిని కొట్టడు. ఎన్నో విషయాల్లో అతను మంచివాడనే చెప్పాలి.

కాని అతనికి గుంటూరు వాళ్ళయందు ఘోరమైన ద్వేషం ఉంది.

సైజుకి అతను ఉల్లిపాయంత మనిషి ఉంటాడు. అతను అందగాడని చెప్పడానికి అవకాశంలేదు. అతని ఛాయ నలుపు. అతను వికారంగా ఉంటాడని చెప్పడానికి చాలా అవకాశాలు ఉన్నాయ్.

అతను బి.కామ్ పరీక్ష పాసయేడు. విశాఖపట్నంలో ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు.

అతని తండ్రి అతణ్ణి "నరసన్నా" అని పిలిచేవాడు. అతను అలా ఇప్పుడు పిలవడంలేదు. అతను చనిపోయేడు.

నరసన్న తల్లి పేరు సముద్రాలమ్మ. చేటలో బియ్యం చెరుగుతూ ఇరుగు పొరుగు అమ్మలక్కల్తో "మా నరసన్న ఉన్నాడే....." అంటూ గొప్పలు చెప్పే అలవాటు ఆమెది. ఆ అలవాటు ఆమెకి ఇప్పటికీ ఉంది.

నరసన్న నాకు చాలాకాలంనుంచీ బాగా తెలుసు. అతను నాకంటె రెండు సంవత్సరాలు చిన్న. అంటే అతనికి ఇప్పుడు ఇరవై ఎనిమిది సంవత్సరాలు. అతను నాకంటె రెండు క్లాసులు వెనక, అంటే, నేను బియ్యే పాసయిన సంవత్సరం అతను ఇంటర్మీడియేటు పరీక్ష పాసయేడు. ఆ సంవత్సరం విశాఖపట్నంమీద జపాన్‌వాడు బాంబులు వెదజల్లేడు ఊళ్ళోంచి చాలామంది తోకలు ముడుచుకొని వెళ్ళిపోయేరు. ఆంధ్రా యూనివర్సిటీ గుంటూరు వెళ్ళింది.

నరసన్న బి.కామ్. చదువు గుంటూర్లో జరిగింది.

అప్పట్లో ఆరంభమయింది నరసన్న రోగం; అనగా గుంటూరు ఎడల ద్వేషం.

నిజంగా అదొకరకమైన రోగం.

రెండేసి రోజుల కొకసారైనా గుంటూరు వాళ్ళనీ, ఆ జిల్లావాళ్ళనీ తిట్టకుండా ఉండలేదు

అతను. వాళ్ళను తల్చుకుంటే తనకి నిద్ర పట్టదని అతను ఎన్నోసార్లు చెప్పేడు. అతనికి వాళ్ళమీద ఒక విధమైన పగ; ఒక రకం కసి.

అది ద్వేషమనే జబ్బు.

జబ్బుకి కారణం ;

లక్షా యాభైకారణాలు ఉండవచ్చు.

లక్షాయాభై కారణాల్లోనూ ముఖ్యమైనది వెక్కిరింతా వేళాకోళం.

అని నేననుకొందికి కారణం -

అక్కడి వాళ్ళు అన్న మాటలన్నీ తల్చుకొని, చెప్తూ నరసన్న మండిపడిపోతూ ఉండటం.

గుంటూర్లో, ఎవరో అనామకులు ఎన్నోరకాలుగా వెక్కిరించేరట. విశాఖజిల్లా వాళ్ళనీ, విశాఖపట్నం మనుషుల్నీ, నరసన్ననీ, ఆ రకరకాలు ఇవి :

"మీ పేరు అప్పల్సామా, లేక అప్పల నరసింహమా?"

"మీది 'ఒయ్‌జాగు' కాబోలు ఏమండీ?"

"అసలైన ఆంధ్రా కల్చరు చూడాలంటే గుంటూర్లో చూడాలి. మీ తూర్పువాళ్ళ 'ఏటి' 'కూకో' కల్చరు ఆంధ్రాకల్చరంటే మాకు సిగ్గు సిగ్గు."

"అప్పలస్వామిగారికి,...... సారీ...... అప్పల నరసింహంగారికి 'వన్నె' కావాలట"

"క..... అప్పల నరసింహంగారూ, మీకు 'దువ్వెన' అక్కర్లేదా;"

"వైజాగ్ వాళ్ళకి తిండెక్కడయ్యా ఉంది?"

"మీ ఊళ్ళో ఇసక పర్రలూ, రాతికొండలూ, ఎర్రమన్నూ, ఉప్పు నీళ్లూ ఉన్నాయంటే ఒప్పుకుంటాం."

"ఇద్గో అప్పల్నర్సివంగోరూ! ఎపుడెలిపొచ్చీసేరు! సెల్యూల్లో కూల్పగుర్ర?

"అప్పల్నర్సివంగోరు మాట్లాడుతున్నారు. శ్రద్ధగా వినండి."

"కప్పల్సాం! కప్పల్సాం! అణాపరక! అణాపర్క!"

ఇలాటి చిల్లర హాస్యపు, వేళాకోళపు మాటలు ప్రతి ఊరి గురించి మరో ఊరివాళ్ళు అనడం ఆంధ్రదేశంలో కద్దు. వాడు వీణ్ణి వెక్కిరిస్తే వీడు వాణ్ణి వెక్కిరిస్తాడు. అది అంతటితో ముగుస్తుంది.

నరసన్నలో, అది అంతటితో ముగియకపోడానికి కారణం, అతను ఇంకొకర్ని వెక్కిరించలేడు. వెక్కిరించే అలవాటు లేదనికి. నలుగురితోనూ వాదించడానికి అతను మొహమాట పడతాడు.

అందుచేత కోపంతో దహించుకుపోతూ వుంటాడు.

అన్ని వెక్కిరింతల్లోకీ నరసన్నలో ద్వేషం, విషం, తెచ్చిపెట్టినది అక్కడవాళ్ళు ఇక్కడ ముట్టకాల్చడం గురించి చేసే వెక్కిరింత.

విశాఖజిల్లాలో కొందరు ఆడవారు చుట్టలు కాల్చడం గురించి విశాఖ జిల్లాలకి చెందని మిగతా ఆంధ్రులు సిగ్గుపడ్డం, నే నెరుగుదును.

ఓ వూళ్ళో ఓసారి, ఓ కాఫీ హోటెల్లో నేను టిఫిన్ తీసుకుంటుంటే పక్క బల్లదగ్గర ఓ అరవ్వాడూ, ఓ తెలుగువాడూ మాట్లాడుకొంటున్నారు.

"మీ ఆంధ్రాస్ గురించి మీ నాగరికత గురించీ పెద్దమాటలు నాతో చెప్పకు. మీ ఆడాళ్ళంతా చుట్టలు కాలుస్తారు. షేమ్ షేమ్." అన్నాడు అరవ్వాడు, ఇంగ్లీషులో.

తెలుగువాడి ముఖంలో సిగ్గూ, బాధా కనిపించేయి.

ఆంధ్రుల్లో ఆడవాళ్ళంతా అలా చుట్టలు కాల్చరనీ, ఒక్క విశాఖ వాళ్ళే అలా చేస్తారనీ, విశాఖవాళ్ళకీ మిగతా ఆంధ్రులకీ చాలా తేడా వుందనీ,

చాలాచెప్పి, దక్షిణాదివాణ్ణి నమ్మించడానికి ఘోరమైన ప్రయత్నం చేసి, చివర్న ఆఖరిమాటగా, గట్టిగా,

"వైజాగ్‌వాళ్ళు ప్యూర్ ఆంధ్రాస్ కారు" అన్నాడు ఆ తెలుగువాడు.

"కాలుస్తే కాలుస్తారు! కాల్చడం అనాగరికత అని ఎలా అంటావ్ నువ్వు?" అని ఆ అరవ్వాణ్ణి దమాయించి అడక్కుండా.

నాకు వాళ్ళిద్దరిమీదా చాలా కోపం వచ్చింది.

("చాలా కోపంవచ్చి ఏం చేశావ్ నువ్వు? "అని నన్నెవరూ అడగవద్దు)

నరసన్నక్కూడా ఈ విషయం తల్చుకున్నప్పుడల్లా విపరీతమైన కోపం కలుగుతూ ఉంటుంది.

"రోజల్లా కూలి నాలి చేసిన ఆడవాళ్ళు ఓ చుట్ట కాల్చక, ఓ మంచి నీటి చుక్క తాగక చస్తారా?" అంటాడు నరసన్న ఈ టాపిక్ వచ్చినపుడల్లా.

నేను ఈ విషయంలో అతన్తో ఏకీభవిస్తూ ఉంటాను.

చుట్టకాల్చే ఆడవాళ్ళ శీలాన్ని గురించి కూడా శంకించడం చాలా అన్యాయం.

వాళ్ళ శీలాన్ని కూడా శంకిస్తూ అన్న మాటలు నరసన్న చెవుల్లో ములుకుల్లా గుచ్చుకొని ఉంటాయి.

మామూలువాళ్ళు అలాటి మాటల్ని చవకరకం వేళాకోళం కింద తీసుకుంటారు. నరసన్న మాటల్ని అలా తీసుకోడు. తీసుకోక, ఆగ్రహావేశాపరుడై పోతాడు.

అందుకు కారణం ఉంది.

విశాఖజిల్లాలో పాటకపుజనం, ఆడా మగా కూడా, చుట్టలు కాలుస్తారు.

నరసన్న తలిదండ్రులు పాటకపుజనంలోంచి వచ్చారు.

నరసన్న తండ్రికి ఉండే ఒకే ఒక పెద్ద ఆశ, కొడుకుచేత పెద్ద చదువు చదివిద్దామనేది.

ఎంతో కష్టపడి, చెమటోడ్చి అతను నెరవేర్చుకున్నాడు తన ఆశ. తరువాత చనిపోయేడు.

నరసన్న తల్లి ఇంకా జీవించే ఉంది. ఆమె ఇప్పటికీ చుట్ట కాలుస్తుంది.

చుట్ట కాల్చే ఆడవారి గురించి ఆలోచించకుండా, అర్థం పర్థం లేకుండా పైవాళ్ళు చేసే వెక్కిరింతవల్ల నరసన్నకి ఎందుకంత కోపం, పట్టరాని కోపం కలుగుతుందో నాకు అర్థం అవుతుంది, పైవాళ్ళకి అర్థం కాదు.

చుట్ట కాల్చే ఆడవాళ్ళని గుంటూరు వాళ్ళు వెక్కిరించినందువల్ల నరసన్నకి గుంటూరు వాళ్ళమీద తెగకోపం; చుట్ట కాల్చే ఆడవాళ్ళ యందు అభిమానం.

నాకు చుట్ట కాల్చే అలవాటు ఉంది.

ఓసారి నేను అతనింట్లో కూర్చొని అతన్తో మాట్లాడుతూ వాళ్ళ ఇంటి పని మనిషిని బజార్లోకి వెళ్ళి నాకు చుట్టలు పట్టుకురమ్మన్నాను. పై ఇంటి పని మనిషి చేత వట్టినే పని చేయించుకోడం ఇష్టంలేక "కావలిస్తే నువ్వో అణా చుట్టలు పుచ్చుకో" అన్నాను ఆమెతో.

"ఇశా! అందర్నాగా నాను సుట్టకాల్సను" అంది ఆమె డబ్బులు పుచ్చుకొని బయల్దేరుతూ.

నరసన్న ఒక్కక్షణం చూసేడు ఆమెవైపు.

ఆ మర్నాడే ఆమెని పనిలోంచి తొలగించేడు.

చుట్ట కాల్చని పనిమనిషిని చూసి అసహ్యించుకున్న నరసన్న వైజాగ్‌లో కొద్ది మంది అయినా పొట్టిగా ఉండడం సహించలేడు.

"మా పాటి పొడవు మనుష్యులు మనదేశంలో ఎక్కడో కాని కనిపించరు" అనేవారట గుంటూర్లో.

"మా వైపుకూడా పొడవుగానే ఉంటారు" అనే వాడట నరసన్న.

"అవునవును. నిన్ను చూస్తేనే తెలుస్తోంది" అని ఏక ఏక నవ్వేవారట వాళ్ళు.

నరసన్న పొట్టివాడవడం ఓ గొప్ప దురదృష్టం.

"మా జిల్లాలో అంతా నాలాగ ఉండరని చెప్పడం ఎలాగెలాగ?" అనిపించేదట నరసన్నకి.

విశాఖపట్నంవాళ్ళు ఆవూళ్ళో ఎవరు ఉన్నారో ఆదిలో అతనికి సరిగా తెలియలేదట. తరువాత ఓ నలుగురు విశాఖపట్నం మనుష్యుల్ని స్నేహితులుగా చేసుకున్నాడు గుంటూర్లో.

వాళ్ళు ఇప్పటికీ తరచుగా నరసన్న దగ్గరికి వస్తూంటారు. అందుచేత నాక్కూడా వాళ్ళని తెలుసు. నలుగుర్లోనూ, ఒకడు బొబ్బిలి వెలమ; ఒకడు గజపతి నగరం పంతులు; ఒకడు డెంకాడ రాజు; ఒకడు అనకాపల్లి గవర. ప్రస్తుతం అమల్లో వున్న నైతిక చట్టం ప్రకారం వాళ్ళు మిక్కిలి దుష్టులు, సంతకం చేయని లవ్ లెటర్స్ ఎడం చేత్తో రాయడం. చీకట్లో గంటల కొద్దీ మాటుకాయడం. మోతాదుగా 'మందు' సేవించడం దుకాణాల్లో అతి సులభంగా అరువు తెచ్చుకోవడం, మొహమాటం లేకుండా అప్పులు ఎగ్గొట్టడం, చక్కటి అబద్ధాలు ఆడ్డం, ఇలాటి పనుల్లో వాళ్ళకి మంచి తరిఫీదు ఉంది.

"వాళ్ళతో ఎలా స్నేహం కలిసిందిరా నీకూ?" అనే నేను ఆశ్చర్యపడ్డాను మొదట్లో. వాళ్ళు అతని కంటె బాగా పెద్దవాళ్ళు. గుంటూర్లో ఉద్యోగాలు చేసే వారు.

"వాళ్ళు గుంటూర్లో ఉండేవాళ్ళు. మనవైపు వాళ్ళు.

"అయితే?"

"మనవైపు వాళ్ళు అటువైపు తక్కువ" అని కొంతసేపు ఊరుకొని

"అదీగాక, మరి, వాళ్ళు, అక్కడ చాలా మందికంటె గూడా పొడవు" అన్నాడు నరసన్న. వాళ్ళు నలుగురూ జమాజెట్టిల్లా ఉంటారు. దిలీప మహారాజు గుణాలేవీవాళ్లల్లో లేకపోయినా, వాళ్ళల్లో ప్రతిఒక్కడూ కూడా "సాలప్రాంశుర్మహాభుజః" అన్నట్టుగానే ఉంటారు.

గుంటూరు వాళ్ళ వెక్కిరింతకి జవాబుగా, నాలుగు పొడవైన జవాబులు చూపించేవాడు నరసన్న.

అప్పట్లో గుంటూరు వాళ్ళకి "అన్‌ది స్పాట్" చూపించడానికి ఉపయోగపడిన ఆ స్నేహితుల్లో ఎన్ని తప్పులున్నా క్షమించిపారేస్తాడు అతను.

గుంటూరంటే ఇష్టం లేనివాళ్ళని చూస్తే నరసన్నకి ఇష్టం.

నేనూ, నరసన్నా ఓ రోజున బస్సులో విజయనగరం వెళ్తూంటే ఆ బస్సులోనే మరొకాయన్తో మాకు పరిచయం ఏర్పడింది.

"మాది ఈ దేశం కాదు. మాది కర్నూలు జిల్లా" అన్నాడతను. మాతో దేశానికీ జిల్లాకి తేడా లేనట్టు మాట్లాడిన ఆ ఆసామీ కడప రాళ్ళ వ్యాపార సందర్భంలో కర్నూలు నుంచి విశాఖపట్నం వచ్చి విజయనగరం వెళ్తున్నాడు.

అతనికి సర్కారు వారంటే ఇష్టం లేదన్నది స్పష్టం. మేంకూడా సర్కారు వాళ్ళం కాబట్టి మా అందర్నీ తిట్టినట్టుగా కాకుండా, తన జిల్లాకి పక్కగా ఉన్న గుంటూర్ని విమర్శించడం ప్రారంభించేడు అతను.

అతణ్ని ప్రాణమిత్రుల్లాగ, ఆప్త బంధువులాగ ఆ బస్సులోనూ, విజయనగరంలోనూ, కూడా ఆదరించి చంపేడు నరసన్న. గుంటూరంటే అతనికి ఇష్టం లేదన్న వాసన వేయగానే.

గుంటూరు జిల్లా వాళ్ళకి మంచి కలగడం నరసన్నకి ఇష్టంలేదు. వాళ్ళకి చెడ్డ కలిగితే నరసన్న అట్టే విచారించడు.

మద్రాసులో ఓ ఇంగ్లీషు దినపత్రికలో సంపాదకవర్గంలో ఉండే ఓ చదువుకొన్న నాన్-ఆంధ్రా జెంటిల్‌మాన్, ఆంధ్రదేశంలో తుఫాన్‌వల్ల చాలా నష్టం కలిగిందనీ, చాలా మంది చనిపోయారనీ విన్నప్పుడు సంతోషంతో ఆఫీసులో అందర్నీ కౌగలించుకొన్నాడని విన్నప్పుడు నేను చాలా షాకయేను.

అంతటి విపరీతమైన మనస్తత్వాలు ఉంటాయని నేను ఎన్నడూ అనుకోలేదు.

నరసన్న చాలా మంచివాడు. అతను చెడ్డవాడు కాడు. కాని కొన్ని దుర్గుణాలు

ఇటువంటివి ఉన్నాయి. లోకంలో ఎవ్వరిమీద ద్వేషం లేదతనికి, గుంటూరు వాళ్ళ మీద తప్పించి.

గుంటూరులో ఎండల తీవ్రత గురించి పేపర్లో ఎంత చిన్న వార్త ఉన్నప్పటికీ అతను చదువుతాడు. గుంటూర్లో వడదెబ్బ వల్ల ఎవరో చనిపోయారని ఎప్పుడయినా పడే వార్త చదివినప్పుడు కలిగిన సంతోషం అమానుషం అని అతనికి తెలుసు. అందుచేత ఆ సంతోషాన్ని దాచుకొందికి ప్రయత్నిస్తాడు. "గుంటూరులో నీటి ఎద్దడి" అనే శీర్షిక అతను తరచు చూసేవాడు. ఇటీవల అక్కడ మంచినీటి సప్లయి గురించి పత్రికలో చదవడానికి ఎక్కువ సరదా చూపించలేదతను. గుంటూర్లో మెడికల్ కాలేజీ పెట్టినప్పుడు "బెజవాడలో పెట్టరాదా? బందర్లో పెట్టరాదా? మధ్య ఆ గుంటూర్లో ఎందుకు పెట్టాలి? అని గింజుకు పోయేడు.

పొట్టి శ్రీరాములుగారు తపస్సు చేసిన రోజుల్లో ఒక రోజున ఎవరో వచ్చి నరసన్నతో శ్రీరాములుగారిది గుంటూరు జిల్లా అని చెప్పేడు. నేనుకూడా ఆ సమయంలో అక్కడే ఉన్నాను.

సుత్తితో నెత్తిమీద కొట్టినట్టుగా కళ్ళు తేలవేసి అలానే ఉండిపోయేడు నరసన్న. 'మదర్ సీరియస్, స్టార్ట్ ఇమీడియట్లీ" అనే టెలిగ్రాం చదివిన వాడిలా ఉంది అతని ముఖం.

"అతనిది గుంటూరు కాదయ్యా! నెల్లూరు, నాకు తెలుసు" అని నేను చెప్పినా, ఏడ్చే పిల్లణ్ణి ఓదార్చే కల్లబొల్లి మాటల్లా తీసుకొనేవాడు అతను నా మాటల్ని.

"శ్రీరాములుగారిది గుంటూరేమోననే బెంగతో నరసన్న బరువుతగ్గి చిక్కిపోయేడు".

చివరికి పత్రికల్లో ఆయన జీవితం గురించి చదివి ఆయన నెల్లూరు జిల్లావారనీ, మద్రాస్‌లో పుట్టేరనీ, తెలుసుకొని తేరుకున్నాడు నరసన్న.

గుంటూరు పట్టణాన్ని ఆంధ్రరాష్ట్రపు ముఖ్యపట్టణంగా చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారని వినగానే నరసన్న మండిపడ్డాడు.

కాని ఆఖరికి గుంటూరే రాజధాని అయిపోతుందేమోననే భయం అతణ్ణి పీక్కుతినేసేది.

చివరికి ఓ రోజున భయం పట్టలేక "గుంటూరు కాపిటల్ కాకపోతే కనకమహాలక్ష్మికి కొబ్బరికాయ కొడతానయ్యా" అన్నాడు నాతో అది నవ్వులాలకి చెప్పిన మాటకాదు.

"విజయవాడైనా అవాలి, లేదా విశాఖపట్నమైనా అవాలి. గుంటూరు రాజధానిగా ఉంటే ప్రజలకు కలిగే ఇబ్బందులు" వగైరా అంశాల గురించి కనపడ్డ వాళ్ళందరితోటీ డిస్కస్ చేసేవాడు, లేని ధైర్యం తెచ్చుకొని, విశాఖపట్టణం కాని విజయవాడ కాని ముఖ్యపట్టణం కానందుకు విచారించినా, గుంటూరు కానందుకు సంతోషించిన వాళ్ళలో నరసన్న ఒకడు.

ఆంధ్రులంతా గర్వింపదగిన పల్నాటి వీరుల గురించి నరసన్నకి పెద్ద అభిప్రాయం లేదు. పల్నాటి యుద్ధం గురించి ప్రసక్తి వస్తేచాలు నరసన్న "అబ్బే" అని చప్పరించేస్తాడు.

"మన బొబ్బిలి యుద్ధంపాటి ఎన్నడూ చెయ్యదు" అంటాడు. ఆంధ్ర రాష్ట్రోద్యమంలో ట్రెయిన్లన్నీ ఆపడం గుంటూరువారే ప్రారంభించినందుకు నరసన్న కొంత కష్టపడ్డాడు. కాని, అనకాపల్లిలోను, విశాఖపట్టణంలోను, కాల్పులు జరగవలసినంత తీవ్రరూపంలో ఉద్యమం

సాగినందుకు సంతోషిస్తాడు. పోలీసువారు అక్రమంగా కాల్చేరంటే వార్ని నిందించడంకూడా మర్చిపోతాడు నరసన్న.

"గుంటూర్లో టియర్‌గ్యాస్ మాత్రం ప్రయోగించేరు. మరి మన ఊళ్ళో అంతటితో ఆగిందా?"

ఇది, ఇటువంటిది నరసన్న స్వభావం. అదొక రకం జబ్బని అతనికి తెలియదు.

చాలామందికి తెలియదు. గుంటూరుకి సంబంధించిన విషయాల్లో అతని మనసు మార్చడానికి ప్రయత్నంచేసి ప్రయోజనంలేదు.

ఒక విషయంలో నేనూ ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది.

బరంపురం అతని అత్తవారి ఊరు. అతని భార్యకి కొంత అందం ఉంది. కొంత చదువు ఉంది. ఆమె తండ్రికి బాగా డబ్బు ఉంది.

అందం, చదువూ, డబ్బు అటుంచగా ఆమె చాలా మంచి మనిషి. నాకు ఆమె కుటుంబాన్నంతా బాగా తెలుసు. ఆమె చిన్నతనంనుంచీ ఆమెని తెలుసు. వాళ్ళకి నరసన్న సంబంధం తీసుకువచ్చిందికూడా నేనే.

వాళ్ళ కులంలో చదువుకున్నవారు తక్కువ. నరసన్నకి, పెర్సనాలిటీ లేకపోయినా, డబ్బు లేకపోయినా, చదువు వుంది కదా అని పిల్లని ఇచ్చేరువాళ్ళు.

ఆ పెళ్ళికి ఓ విధంగా నేనే కారకుణ్ని అవడంచేత నేనుకూడా బాధపడవలసి వస్తోంది.

నరసన్నకి "గుంటూరు జబ్బు" ఉందని నాకు అప్పట్లో తెలీదు. బరంపురం స్వస్థలంగా గల ఆ పిల్లల తండ్రి గుంటూరు జిల్లాలో కొంత కాలం పని చేసేడని నేనంతగా గుర్తుంచుకోలేదు. గుంటూరుజిల్లా గుంటూరు పట్నం నరసన్న భార్యయొక్క జన్మస్థలమని పెళ్ళి ఆయాక కొన్నాళ్ళకి తెలిసింది నరసన్నకి నాకూ కూడా.

అంతవరకూ ఆమెని ఎంతో అభిమానంతో చూసుకువస్తోన్న నరసన్న పైకి కిక్కురుమన్లేదు.

ఓ రోజున మాత్రం ఆమెని పుట్టింటికి తీసుకువెళ్ళేడు. తను ఒంటరిగా తిరిగి వచ్చాడు. ఆమెని తిరిగి తీసుకురాలేదు.

"అది గుంటూర్లో పుట్టిందనే సంగతి, ముందుగానే నాతో ఎందుకు చెప్పకపోవాలి? అంత రహస్యంగా ఎందుకు దాచాలి?" అని కోపంగా ప్రశ్నిస్తూంటాడు.

"మా అమ్మాయి ఫలాన ఊళ్ళో పుట్టింది. ఆ ఊరంటే మీకు ఇష్టం ఉంటే మా అమ్మాయిని చేసుకోవచ్చు. ఆ వూరంటే మీకు అభ్యంతరం ఏమైనా ఉందా?" అని ఎవరైనా ఎక్కడైనా అడుగుతారా? ఫలానా వూళ్ళో పుట్టడం గొప్ప నేరమని ఎక్కడైనా రాసి ఉందా? ఎక్కడున్న వాళ్ళు అక్కడ పుట్టక ఏం చేస్తారు?

అదీగాక, యిటువంటి వెర్రి ఉందని వాళ్ళకేం తెలుస్తుంది. "నాకు ఈ విధంగా ఒక రోగం ఉందండి. అటుపైన మీ ఇష్టం. పిల్లని ఇస్తే ఇవ్వండి. లేకపోతే మానండి." అని

నువ్వెందుకు వాళ్ళతో చెప్పలేదు?" అని ఎంత చెప్పినా లాభంలేదు. మారమాట్లాడక లేచి వెళ్ళిపోతాడు నా దగ్గర్నుంచి.

అంతేగాని పిల్లని తీసుకురాడు.

నరసన్న ప్రవర్తన గురించి నేను సిగ్గుపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. బరంపురం వెళ్ళినప్పుడల్లా అతని అత్తవారింటికి వెళ్ళేవాణ్ని. ఆ వెళ్ళటం ఇప్పుడు మానుకోవాల్సి వచ్చింది.

అయినా ఒకసారి వెళ్ళక తప్పిందికాదు. నరసన్న మావఁగారు ఆ వూళ్ళో దార్లో కనిపించి వాళ్ళ యింటికి లాక్కుపోయారు నన్ను.

నేను వెళ్ళేసరికి నరసన్న భార్య లోపల వరండాలో స్తంభాన్ని ఆనుకొని కూర్చుంది. ఆమె చేతిలో ఓ ఉత్తరం ఉంది. నేను వెళ్ళేసరికి హడావుడిగా లేచింది. ఆమె ఏడుస్తోంది.

"ఎక్కణ్నించీ ఉత్తరం?" అని అడిగాడు ఆమె తండ్రి.

ఆమె జవాబు చెప్పకపోవటం చూచి, భర్త రాసిన జాబనే అనుకున్నాం, ఆమె తండ్రీ నేనుకూడా.

"ఏమంటాడే? ఏమంటాడు?" అని అడిగాడు ఆమె తండ్రి.

"అంతే అంతే" అని ఏడుస్తూ మళ్ళీ కూలబడింది ఆమె. ఏడుస్తూ ఏడుస్తూ కూర్చొంది అలానే.

నాకు అప్పుడు చాలా బాధ కలిగింది. ఏం చెయ్యాలో తోచింది కాదు.

నా చిన్నతనంలో మా ఇంటిపక్క ఓ బట్టతలాయన ఉండేవాడు. ఎండలో, దీపాల వెలుగులో అతని తల నిగ నిగలాడేది.

మా ఎదటింట్లో బట్టతలవాడు కాని మనిషి ఒకాయన ఉండేవాడు. అతను వయసుకి పెద్ద. పెంకితనానికి చిన్న. బట్ట తలాయన పగలు వీధిలోకి వచ్చినప్పుడల్లా "అయ్యా! ఇంత ఎండగా ఉందిగదా! మీ బట్టతలకి ఓ తలబట్ట ఉపయోగించరాదా?" అని అడిగి నవ్వేవాడు ఎదటింటిమనిషి.

అంతటితో ఆగక మా చిన్నపిల్లల్లో కొంత మందికి కాణీ కాణీ చొప్పున ఇచ్చి మా పక్కింటి బట్టతలాయన్ని "జపాన్‌గుండూ, జపాన్‌గుండూ" అని ఎదటింటాయన పిలిపించేవాడు కూడాను.

నాకు చిన్నతనం కాబట్టి అంతగా తెలీలేదు. కానీ, బట్టతలాయనకి ఎదటింటి ఆసామీ యెడల విపరీతమైన కోపం కలిగే ఉంటుంది.

ఒకరోజున నేనూ, ఎదటింటి ఆసామీయొక్క ఆరేళ్ళ కొడుకూ మా పక్కింటి బట్టతలాయన ఇంటికి పిల్లల్తో ఆడుకొందికి వెళ్ళేం. ఆడుకొంటూ ఉంటే అకస్మాత్తుగా బట్టతలాయన వచ్చి ఆరేళ్ళ పిల్లాడి రెక్కపట్టుకొని వీపుమీద ఛెళ్ళుమని కొట్టి "ఎవర్రా నిన్నిక్కడికి రమ్మన్నది? ఫో మీ ఇంటికి ఫో" అని కేకలువేసి కసిరేడు.

ఆరేళ్ళ కుర్రవాడు మొట్ట మొదటిసారిగా బిక్కచచ్చిపోయేడు. తరువాత బిగ్గరగా ఏడ్చేడు. ఏడుస్తూ వెళ్ళిపోయేడు.

మా అందరికీ బట్టతలాయన ప్రవర్తన చూసి భయమేసింది. కోపం వచ్చింది.

ఆరేళ్ళ పిల్లడు ఆనాడు ఏడ్చినట్టే నరసయ్య భార్య స్తంభానికి చేర్లబడి కూర్చొని ఏడుస్తోంది.

ఏం మాట్లాడ్డానికి తోచక నేను ఊరుకొన్నాను. చేసేదేమీలేక బైటికి వచ్చేశాను.

తరువాత ఓ స్నేహితుణ్ణి కలుసుకొందికి వెళ్ళేను. అతను ఉండే ఇంట్లో ఓ భాగంలో ఎవరో ఒరియావాళ్ళున్నారు. నేను వెళ్ళేసరికి ఆ భాగంలోంచి కటకంలో ఉన్నటువంటి కల్తీలేని ఒరియా కల్చరు బరంపురంలో లేదని ఒకడు గట్టిగా కేకలు వేస్తున్నాడు.

నేను అక్కణ్నుంచికూడా బైటికి వచ్చేశాను.

(ఈ కథలో "నేను", "అప్పల నరసింహం" అనే పాత్రలు నిజంకావు. ఇదంతా ఒక కథ. ఇది నిజంకాదు, కానేకాదు)

*ఆంధ్రపత్రిక వారపత్రిక, 8-7-1953*